# వెలుగు

సాయంత్రం ఆరు గంటలయింది. చీకటి పడింది-పడుతోంది.

ఇంటి నిండా చీకటి వ్యాపించింది. ఇంకా దీపం వెలిగించలేదు.

వెలిగించాలనిపించలేదు సావిత్రికి.

గదిలో మంచమ్మీద కళ్ళు మూసుకుని కదలకుండా పడుకుంది.

కిటికీ పై రెక్కలు తెరచి వున్నాయి.

అందులోంచి మాత్రం సాయంత్రం రాత్రిగా మారేప్పటి మసక మసక వెల్తురు కొద్దిగా గదిలోకి చొరబడుతోంది.

ఆ వెల్తురు కాస్త ఎర్రగా వుంది.

బయట నుంచి గాలి కూడా మెల్లగా తెరలు తెరలుగా లోపలి కొస్తోంది.

ఆ గాలి చల్లగా వుంది.

పెరట్లో అప్పుడప్పుడే విచ్చుకుంటున్న పూల వాసన కూడా ఆ గాలితో పాటు లోపలి కొస్తోంది.

నిజానికికది మంచి వేళ.

మనసు హాయిగా వుండాల్సిన వేళ.

తియ్యటి ఆలోచనలూ కోరికలూ చెలరేగవలసిన సమయమది.

అవేమీ లేకపోయినా, కనీసం మనసు ప్రశాంతంగా చల్లగా వుండాల్సిన తరుణమది.

కాని-ఆవేళ సావిత్రి మనసు ప్రశాంతంగా లేదు. చల్లగా లేదు.

మరి కాస్సేపట్లో బ్రద్దలవడానికి  సిద్ధంగా సెగలూ పొగలూ కక్కుతున్న అగ్ని పర్వతంలా వుంది- అప్పుడు సావిత్రి మనసు.

ఇహనో యిప్పుడో పొంగి, అన్ని హద్దులూ మీరి, అన్ని గట్లూ తెంచుకుని, ఒక్క పెట్టున సమస్త  ప్రపంచాన్నీ ముంచి వెయ్యడానికి సిద్ధంగా వున్న మహాసముద్రంలా వుంది అప్పుడు సావిత్రి మనసు. పెనుతుఫాను రావడానికి ముందుండే ఆకాశంలా సావిత్రి మనసప్పుడు మహా భీభత్సంగా వుంది.

తిండికి కొదవలేదు. ఆరోగ్యానికి లోటు లేదు.

మంచి తిండీ మంచి ఆరోగ్యమూ వున్నప్పుడు పాతికేళ్ళ ఆడ దెలా వుంటుందో సావిత్రి అలాగే వుంటుంది.

మంచి అందం కూడా వుంది.

సావిత్రికి పెళ్ళయింది. అయికూడా అప్పుడే అయిదేళ్ళయింది.

మొగుడున్నాడు. అతని పేరు రంగారావు.

అతని కావూళ్ళో స్వంతయిల్లుంది.

ఆరేడు వందల రూపాయల జీతంగల గవర్నమెంటుద్యోగం వుంది.

సావిత్రికి దీటయిన వాడు కాకపోయినా అతనూ అంతో యింతో అందగాడే.

సావిత్రికి ఓ కొడుకున్నాడు.

మూడేళ్ళ క్రితం-అంటే పెళ్ళయిన రెండేళ్ళకి పుట్టాడు.

వాడికి సావిత్రి పోలిక లొచ్చాయి.

అంచేత అందంగా  వుంటాడు.

సావిత్రిలాగే ఎర్రగా బొద్దుగా వుంటాడు. ముద్దు ముద్దుగా మాటలు చెబుతాడు.

వాడికింకా పేరు పెట్టలేదు.

సావిత్రి వాణ్ణి 'నానీ' అని పిలుస్తుంది. సావిత్రి మొగుడు వాణ్ణి ఏమనీ పిలవడు.

కొడుకుతో అసలు మాట్లాడడు. ఎత్తుకోడు. ముద్దులాడడు.

తనకొడుకు-తన కొడుకు కాదని రంగారావుకి-అనుమానం.

మూడేళ్ళ క్రితం పక్కింట్లో ఒక కాలేజీ లెక్చరర్ వుండేవాడు. చిన్నప్పుడెప్పుడో సావిత్రితో కలసి చదువుకున్నాడు. రోజూ వీళ్ళింటి కొస్తూ వుండేవాడు. రెండేళ్ళ క్రితం

ట్రాన్స్‌ఫరొచ్చి వెళ్ళి పోయాడు.

చూసిన వాళ్ళంతా సావిత్రి కొడుకు ముమ్మూర్తులా సావిత్రి పోలికే నంటారు.

కాని రంగారావు మాత్రం-'ఈ వెధవ్వి అన్నీ ఆ లెక్చరర్‌గాడి పోలికలే' నంటాడు.

మొదట్లో తనలో తాననుకుని కొన్నాళ్ళకి పైకే అన్నాడు.

సావిత్రి వొప్పుకోలేదు. 'మీరు పొరపాటు పడుతున్నారు'-అంది.

'నాకు తెలుసు, నీ వెధవ్వేషాలు' అన్నాడు రంగారావు.

'మీరు తొందరపడకండి. అతనితో నాకు చిన్నప్పట్నించీ పరిచయమున్న మాట నిజమే. అతనంటే నాకూ నేనంటే అతనికీ యిష్టమున్నాకాని, అతను నన్నెప్పుడూ ముట్టు కోలేదు. నమ్మండి'- అంది సావిత్రి.

రంగారావు నమ్మలేదు.

సావిత్రి ఎన్నో విధాల నచ్చచెప్పాలని చూసింది.

రంగారావు వినిపించుకోలేదు.

సావిత్రి ఏడిచింది.

'నీ దొంగ వేషాలు నా దగ్గర కాద'ని సావిత్రిని పట్టుకుని చితకదన్నాడు రంగారావు.

రంగారావుకి పెళ్ళయిందగ్గర్నించీ పెళ్ళాం మీద అనుమానమే.

సావిత్రి అందగత్తె. అందుకని యింకా అనుమానం రంగారావుకి. ఉంచుకున్నది అందంగా వుండాలి గాని, కట్టుకున్నది అనాకారిగా వుంటేనే మంచిదని అతని వుద్దేశ్యం.

అందమైన దాన్ని చేసుకోగూడదనే అనుకున్నాడు.

కాని పెద్ద వాళ్ళ బలవంతంవల్లా, కట్నం బలం వల్లా సావిత్రిని చేసుకోక తప్పలేదు.

గర్భాదానంనాడే సావిత్రిని నమ్మలేదు రంగారావు.

'ఇది మొదటి సారేనా?' అనడిగాడు.

సావిత్రి ఏడిచింది.

రంగారావు అప్పటికూరుకున్నాడు. వేరే కాపురం పెట్టినప్పట్నించీ వెయ్యి కళ్ళతో సావిత్రిని కాపలా కాస్తున్నాడు.

సావిత్రి బయటి గుమ్మంలో నిలబడితే అనుమానం; మరో మగాడితో మాట్లాడితే

అనుమానం; మరో మగాడి ముందు నవ్వితే అనుమానం; తనొచ్చే సరికి మంచి చీర కట్టుకుంటే అనుమానం; కట్టుకున్న చీర నలిగివుంటే అనుమానం; తల్లోపూలు పెట్టుకుంటే అనుమానం. సావిత్రికి కడుపొచ్చిందగ్గర్నుంచీ, కొడుకు పుట్టిందగ్గర్నుంచీ రంగారావు అనుమానాలు మరీ ఎక్కువైపోయాయి.

మొగుడికి తన్నటం అలవాటైపోయి, తన్నినప్పుడుల్లా ఏడవడం మానేసింది సావిత్రి, 'తన్నినా బుద్ధిలేదని' ఇంకా ఎక్కువగా తన్నడం మొదలెట్టాడు రంగారావు.

సావిత్రి అందం చెడలేదు. పాతికేళ్ళ పడుచుదనపు మెరుగు తగ్గలేదు. అందుక్కోవమొచ్చి మరీ తన్నటం మొదలెట్టాడు రంగారావు.

సావిత్రికి మనసుంది. ఆ మనసులో ఎన్నో కోరికలూ, ఆశలూ, కలలూ వున్నాయి. రంగారావు పశువు కావడంవల్ల అవేవీ నెరవేరకుండా పోయాయి. ఎంత సరిపెట్టుకుందామనుకున్నా, రంగారావుతో కాపరం రోజురోజుకీ దుర్భరమై పోతోంది సావిత్రికి.

సావిత్రి మనసు విరిగిపోయింది. మనసులేని మనిషితో, తన మనసెరగని మనిషితో కలిసి బ్రతకడం సావిత్రికి అతికష్టంగా వుంది.

నాల్రోజుల కొకసారి పెళ్ళాన్ని గొడ్డును బాదినట్టు బాదినా, రోజూ రాత్రిపూట మాత్రం పెళ్ళాంపక్కలోకి రావాలి రంగారావుకి. భార్య యిష్టాయిష్టాలతో, మంచి చెడ్డలతో అతడికి సంబంధంలేదు. 'నువ్వు పెళ్ళానివి. నేను పడుకోమన్నప్పుడల్లా పడుకోవాల్సిందే' అంటాడు. ఇష్టంలేక పోయినా కొన్నాళ్ళు అతనిమాట వింది సావిత్రి. ఆ తర్వాత వినడం మానేసింది. మొండి కేసింది.

'వూళ్ళో వాళ్ళందరితోనూ పడుకునే దానివి, నువ్వు నా దగ్గరెందుకు పడుకుంటావని అప్పట్నించీ రోజూ తన్నడం మొదలెట్టాడు రంగారావు. చంపడానికి భయమేసి వూరుకున్నాడు గాని, లేకపోతే పెళ్ళాన్ని చంపెయ్యాలని అతని కోరిక.

సావిత్రి బండబారి పోయింది. నేను చచ్చినా సరే, నీ దగ్గర పడుకోనని మొగుడితో తెగించి చెప్పేసింది.

సావిత్రికి అందముంది.

వయసుంది.

మొగుడున్నాడు.

౯ సని కాస్తివుంది.

..ంచి వుద్యోగముంది.

౨న్నీవున్నాయిగాని, సావిత్రికి సుఖంలేదు.

సావిత్రి మనిషి.

అంచేత ఆమెకు మనసుంది.

అంచేత ఆమెకు ఆశలున్నాయి; కోరికలున్నాయి; కలలున్నాయి.

అవన్నీ యిన్నాళ్ళూ అణుచుకుంది. కనీసం అణుచుకోవడానికి ప్రయత్నించింది.

..ప్పుడవన్నీ చెలరేగాయి; విజృంభించాయి; రాచిరంపాన పెడ్తున్నాయి.

సావిత్రి యింక తట్టుకోలేక పోయింది.

'నాకు ఆస్తి అక్కరలేదు. సొంత యిల్లక్కర్లేదు ఉద్యోగమున్న మొగుడక్కర్లేదు. ఆఖరికి మూడు పూటలా తిండి లేకపోయినా ఫర్వాలేదు. ఎన్ని కష్టాలు పడినా ఫర్వాలేదు. కాని నాకు మగాడు కావాలి. వాడు మనిషై వుండాలి. నామనసు తెలిసిన వాడై వుండాలి. నన్ను ప్రేమించేవాడై వుండాలి-అనుకుంది సావిత్రి.

ఎప్పుడైతే అలా అనుకుందో, అప్పట్నించీ అనుకోకుండానే అటువంటి వ్యక్తి కోసం వెదకటం ప్రారంభించింది. సావిత్రి.

ఒక్కసారి కనబడితే చాలుననుకుని, సావిత్రికోసం, ఆమె యింటి ప్రహరీ గోడల్ని, వీధిగుమ్మాన్నీ, కిటికీ రెక్కల్నీ రోజూ వెదికే మగాళ్ళు ఆవీధిలో చాలా మంది వున్నారు.

ఒక పెద్దప్రైవేట్ కంపెనీలో చిన్న ఉద్యోగం చేస్తున్న ఒక చిన్న వాడు కూడా వాళ్ళలో వున్నాడు.

వాళ్ళందరిలోనూ అతగాడొక్కడే సావిత్రి కంటబడ్డాడు.

కొన్నాళ్ళకి సావిత్రి కళ్ళల్లోనే అతను కాపురం పెట్టేశాడు.

ఈ మొగుడితో కాపురం చెయ్యటం యింక నావల్లకా'దని సావిత్రి గట్టిగా ౯ను ౦న్న రోజున, తనింక పతివ్రతగా వుండనక్కర్లేదని కూడా అనుకుంది.

అనుకున్న కొద్దిరోజులకే వీధి చివరి చిన్న వాడు ఆమె జీవితంలోకి ప్రవేశించాడు.

ఆ సాయంత్రం చీకటి పడుతోన్న సమయాన-ఆ చల్లటి వేళ-పూలవాసనతో క. డిన చల్లటిగాలి మందంగా వీస్తున్నవేళ-ఆ గాలీ ఎర్రటి మసక. వెల్తురూ గదిలోకి

చొరబడుతున్న వేళ- గదిలో మంచమ్మీద కళ్ళు మూసుకుని కదలకుండా పడుకున్న సావిత్రి మనసులో రేగిన మహాసంక్షోభం-చెలరేగిన పెను తుఫాను-రగిలిన దావానలం ఆ అర్థరాత్రికి చల్లారింది.

అనుకున్న పని చెయ్యడానికే నిశ్చయించుకుంది, సావిత్రి.

అర్థరాత్రి మెల్లగా లేచింది. నాలుగైదు చీరలూ, కొడుకు బట్టలూ, తన నగలూ అన్నీ ఒక చిన్న సూట్‌కేసులో సర్దుకుంది. నిద్రపోతున్న కొడుకుని భుజాన వేసుకుంది. సావిత్రి మొగుడు నిండా ముసుగెట్టుకుని, దున్నపోతులా కదలకుండా పడుకొని వున్నాడు. గురకలు పెడ్తున్నాడు.

ఒక్కసారి నిద్రపోతున్న మొగుడి వంక నిదానంగా చూసింది సావిత్రి.

పైట కొంగుతో కళ్ళద్దుకుంది. కాని ఆమె కళ్ళు పొడిగానే వున్నాయి. ఏడుద్దామన్నా ఏడుపు రాలేదు. సావిత్రికి. ఏడవటం అనవసరమని కూడా అనుకుంది.

భుజాన కొడుకుతోనూ, చేతిలో సూట్‌కేస్‌తోనూ, గదిదాటి, యిల్లు విడిచి, వీధి గుమ్మం దాటి గబగబా బయటికి నడిచింది.

ఆమె కోసం ఉద్యోగం వదిలేసి వున్నవూరు వదిలెయ్యటానికి, అవసరమైతే ప్రాణాలైనా సరే వదిలెయ్యటానికి, సిద్ధంగా-ఆమె నమ్ముకున్న వీధి చివరి కుర్రాడు, ఆమెకోసం వేచి వున్నాడు వీధి చివర.

ఆమె కోరుకున్న కొత్త జీవితపు వెలుగు ఆ రాత్రికి చివర ఆమె కోసమే ఎదురు చూస్తోంది.

మొగుణ్ణీ, ఆస్తినీ, పరువు మర్యాదల్నీ, పాతివ్రత్యాన్నీ వొదిలేసి-కొత్త వూళ్లోకి కొత్త జీవితంలోకి వెళ్ళిపోయింది. సావిత్రి. ●

*( తరుణ మాస పత్రిక - ఏప్రిల్ 1974)*